నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 YADADRI BHUVANAGIRI



భువనగిరి మండలం అనంతారంలోని పల్లె దవాఖానలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ హనుమంతు కె.జెండగే తదితరులు

# ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్యం

- ప్రసవాలు.. మాతా శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ
- జిల్లాలో పలు ప్రభుత్వ దవాఖానల సందర్శన

భువనగిరి కలెక్టరేట్/భువనగిరి అర్బన్/భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 8 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ అన్నారు. ప్రాథమిక, సామాజిక, జిల్లా స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో ఇంకా మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని వైద్య అధికారులకు సూచించారు. భువనగిరి ఏరియా దవాఖానను గురువారం ఆమె రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో నవజాత శిశుసంరక్షణ, తెలంగాణ డయాగ్నస్టిక్ డిస్ట్రిక్ హబ్, సీటీ స్కాన్, బయో కెమిస్ట్రీ, పాథలాజికల్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాలు, మాతా శిశు ఆరోగ్య సేవల పట్ల క్షేత్రస్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. స్పెషాలిటీ డాక్టర్లు ప్రతి వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలందించేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. అంతకు ముందు భువనగిరి మండలం అనంతారంలోని పల్లె దవాఖానను, భూదాన్ పోచంపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ఆర్‌వీ కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చోంగ్తూ మొక్కలు నాటారు. జిల్లాలో జరుగుతున్న వైద్య సేవలు, కార్యక్రమాలపై ఆమె జిల్లా హెల్త్ ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీ డయాగ్నస్టిక్ సేవలు విస్తరించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మనోహర్, డిప్యూటీ వైద్యాధికారి యశోద, భువనగిరి దవాఖాన సూపరింటెండెంట్ రాజారాం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, భువనగిరి ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ దినకర్‌గౌడ్, పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కమిషనర్ వీరారెడ్డి, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, మండల వైద్యాధికారిణి శ్రీవాణి, కౌన్సిలర్ సామల మల్లారెడ్డి, డాక్టర్లు చిన్నా నాయక్, సాయిశోభ, మనోహర్, రామకృష్ణ, పోతారెడ్డి, అరుంధతి, శ్రీదేవి, శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్‌బాబు, గోపాల్‌రావు, బేగ్, భవాని, వాణి, నాగమణి, పాల్గొన్నారు.

## ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తులకు రేపు ఆఖరు

భువనగిరి అర్బన్, ఆగస్టు 8 : ఇంటింటా ఇన్నోవేటర్ –2024 కార్యక్రమం కోసం దరఖాస్తుల గడువును ప్రభుత్వం ఈ నెల 10 వరకు పొడిగించిందని జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఒక్క ఆవిష్కర్త ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. సవాళ్లను పరిష్కరించే అత్యంత ఆశాజనకమైన వాటిని ఎంపిక చేసి ఆగస్టు 15న అవార్డులు ఇస్తారని తెలిపారు. ఆవిష్కర్తలు వాట్సాప్ ద్వారా 9100678543కు దరఖాస్తులను సమర్పించవచ్చని, పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణ గురించి 100 పదాల వివరణ, నాలుగు అధిక రెజల్యూషన్ చిత్రాలు, రెండు వీడియోలు (2 నిమిషాలలోపు) పంపించాలని పేర్కొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నల్లగొండ, ఆగస్టు 8 :తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండకు చెందిన బీసీ నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, ఒకేషనల్ కోర్సుల్లో అర్హత పొంది 18 నుంచి 25 ఏండ్ల వయసు ఉన్న యువకులకు రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఎయిర్ కండీషనర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ చార్జింగ్ విభాగాలతోపాటు ఎల్‌టీవీ, ఓలెడ్ మానిటర్, మైక్రోవేవ్ వోవెన్, వాటర్ ప్యూరిఫైర్ విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు నేటి నుంచి ఈ నెల 24వరకు tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందని, కోచింగ్ వ్యవధిలో 90శాతం హాజరు కలిగిన వారికి నెలకు రూ.4వేల స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ, ఈసీఐఎల్, కుషాయిగూడ శిక్షణ ఇస్తారని, పూర్తి వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండలోగానీ, 08682–220007 నంబర్‌లోగానీ సంప్రదించాలని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

# ఇసుక ధరకు రెక్కలు

## ఒక్కసారిగా పెరిగిన రేట్లు

- దొడ్డు రకం టన్ను రూ.1,500 నుంచి రూ.2,400
- సన్నది రూ.1,600 నుంచి రూ.2,800
- కృత్రిమ కొరతతో అక్రమార్కులకు కాసుల పంట
- వరుసగా వానలు కురుస్తుండడమే కారణం
- మందగించిన నిర్మాణ రంగం



ఇసుక ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. టన్నుకు వెయ్యి రూపాయలకు పైనే ధరలు పెరిగాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇసుక దిగుమతికి కష్టంగా మారగా, అక్రమార్కులు కృత్రిమ కొరత సృష్టిస్తూ కాసులు దండుకుంటున్నారు. ఫలితంగా అధిక ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఇసుక కొరతతో గృహ నిర్మాణదారులు, బిల్డర్లు ఇబ్బందులు పడుతుండటంతోపాటు నిర్మాణ రంగం కూడా మందగించింది.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో జూన్ నెలలో దొడ్డు ఇసుక టన్నుకు రూ. 1,500 నుంచి రూ.1,600 ఉండగా, ఇప్పుడు రూ.2,800–2900కు చేరింది. రూ.1,300 నుంచి రూ.1,400 ఉన్న సన్న రకం ఇసుక రూ.2,400 వరకు పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కంటే ముందు దొడ్డు ఇసుక టన్ను రూ.వెయ్యి, సన్న రకం ఇసుక రూ.1,100 ఉండేది. నిర్మాణాల్లో ఉపయోగించే డస్ట్ రేట్లు కూడా పెరిగాయి. గతంలో టన్నుకు రూ. 400 ఉండగా ఇప్పుడు రూ.450 అయ్యింది.



### మందగించిన ఇంటి నిర్మాణాలు..

ఇంటి నిర్మాణానికి ప్రధానంగా ఇసుక అవసరం. ఇసుక లేకుంటే పనులు ముందుకు సాగడం కష్టం. ఒక్కసారిగా ధరలు పెరుగుదలతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లు, ప్లాట్లు, భవనాల నిర్మాణానికి ముందే అగ్రిమెంట్ చేసుకున్న బిల్డర్లు ఇసుక ధరల పెంపుతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ట్రిప్‌కు వేలల్లో అధికంగా చెల్లించాల్సి రావడంతో పనులు కొనసాగించేందుకు వెనకడుగు వేస్తున్నారు. సొంతంగా నిర్మాణాలు చేసుకునేవారు కూడా పెరిగిన రేట్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతానికి ఇసుకతో సంబంధం లేని పనులు చేసుకుంటున్నారు. దాంతో నిర్మాణాలు మందగిస్తున్నాయి.

### వర్షాలు నేపథ్యంలో..

జిల్లాలో నెల రోజులుగా వానలు పడుతున్నాయి. జిల్లాకు ఇసుక గోదావరి కాల్వ ప్రవహించే పరివాహక ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నది. ప్రధానంగా భూపాలపల్లి నుంచి లారీల్లో ఇసుక లోడ్లు వస్తుంటాయి. ప్రస్తుతం గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇసుక తోడడం కష్టంగా మారింది. దాంతో కొరత ఏర్పడింది. అంతేగాక జిల్లాలోని గుండాల, అడ్డగూడూరు మండలాల్లోని ఇసుక రీచ్‌లు కూడా నడవడం లేదు. ఈ నేపథ్యంలో వర్షాలు, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత ఇసుక రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయని బిల్డర్లు చెప్తున్నారు.

### అక్రమార్కులకు కాసుల వర్షం..

సాధారణంగా టీఎస్‌ఎండీసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకుంటారు. డీడీలు తీసి ప్రభుత్వానికి డబ్బు చెల్లిస్తే ముందే నిర్దేశిత ప్రదేశానికి వచ్చి డంప్ చేసి పోతారు. ప్రస్తుతం ఇసుక కొరత అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికే కొందరు ఎండ కాలంలో పెద్దమొత్తంలో డంప్ చేసి ఉంచారు. ప్రస్తుతం కూడా వాళ్లే వేర్వేరు పేర్లతో డీడీలు తీసి.. ప్రభుత్వం రేటు ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఆ ఇసుకను పెద్ద మొత్తంలో డంప్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దాంతో మార్కెట్‌లో ఇసుక కొరత ఏర్పడడంతో బయట ప్రైవేట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటూ అందిన కాడికి దండుకుంటున్నారు.

## కాంట్రాక్ట్ వైద్య పోస్టులకు దరఖాస్తులు

నీలగిరి, ఆగస్టు 8 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ స్పెషలిస్టుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 14లోగా డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డి.మాత్రు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు గైనకాలజీ, మూడు అనస్తీషియా, ఐదు ఎంబీబీఎస్ పోస్టులు ఉండగా, దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 16న ఇంటర్వ్యూ ద్వా రా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.nalgon da.nic.in వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

## 7 బస్ డిపోల పరిధిలో వేలం టెండర్లు

నల్లగొండ రూరల్, ఆగస్టు 8 : నల్లగొండ రీజియన్‌లోని 7 బస్ డిపోల పరిధిలో ఉన్న బస్ స్టేషన్లలో పలు పనుల నిర్వహణకు ఈ–టెండర్, మ్యానువల్ టెండర్, వేలం టెండర్లను ఇటీవల విడుదల చేసినట్లు ఆర్‌ఎం ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ స్థలాలు, పక్కా మడిగలు, క్యాంటీన్, పార్కింగ్ స్థలాల నిర్వహణ, మెయింటెనెన్స్ ఆఫ్ బస్ స్టేషన్స్ అండ్ ఫ్రీ టాయిలెట్స్‌తోపాటు వివిధ ఔట్‌సోర్సింగ్ పనుల గురించి ఈ టెండర్లను విడుదల చేశామని పేర్కొన్నారు. టీజీఆర్టీసీ తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా జూలై 23 నుంచి ఆగస్టు 12 వరకు టెండర్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ ఫారాలను నల్లగొండ ప్రాంతీయ కార్యాలయంలో మ్యానువల్ టెండర్లు ఆగస్టు 12, ఈ–టెండర్లు 13న, యాక్షన్ టెండర్లను 14న సమర్పించాలని పేర్కొన్నారు.

# జలహోరు.. జన జోరు

- 26 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల
- సాగర్ అందాలు చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు

నందికొండ, ఆగస్టు 8 : నాగార్జునసాగర్‌కు పైనుంచి వరద పోటెత్తడంతో పూర్తిస్థాయిలో డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని దిగువన ఉన్న కృష్ణా డెల్టాకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగానూ గురువారం 585.90 (300.0315 టీఎంసీలు) అడుగులకు చేరింది. డ్యామ్ క్రస్ట్ గేట్లను 18 నుంచి క్రమంగా పెంచుకుంటూ 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,25,462 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 3,52,158 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, 2,72,019 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఎడమ కాల్వ ద్వారా 8,193, కుడి కాల్వ ద్వారా 8,144, క్రస్ట్ గేట్ల ద్వారా 2,25,462, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 885 (215.81 టీఎంసీలు) అడుగులకు ప్రస్తుతం 882 .60(202.51 టీఎంసీల) అడుగులు ఉన్నది. ఆల్మట్టికి 2,61,000, నారాయణపూర్‌కు 2,00000, జూరాలకు 3,00000, శ్రీశైలానికి 3,54,761 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. నాగార్జునసాగర్‌కు కూడ భారీగా ఇన్‌ఫ్లో ఉండడం తో మరికొన్ని రోజులు డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగనున్నది.



26 క్రస్ట్ గేట్ల నుంచి దుంకుతున్న కృష్ణమ్మ పరవళ్లను చూస్తున్న పర్యాటకులు

### పర్యాటకుల సందడి

సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేయడంతో కృష్ణమ్మ అందాలను తిలకించడానికి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే డ్యామ్ వద్దకు చేరుకొని ఫొటోలు, సెల్ఫీలు దిగారు. డ్యామ్ కొత్త బ్రిడ్జి, శివాలయం పుష్కరఘాట్, జలవిద్యుత్ కేంద్రం, డ్యామ్ పిల్లర్, లాంచీస్టేషన్, దయ్యాల గండి పరిసరాలు పర్యాటకులతో సందడిగా మారాయి. చేపల ఫ్రై, ఐస్‌క్రీమ్‌లు, మసాల చాట్‌లను ఆస్వాదిస్తు పర్యాటకులు సరదాగా గడిపారు. పర్యాటకుల రద్దీ నేపథ్యంలో పోలీసులు పటిష్టంగా భద్రతతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. డ్యామ్ 420 లెవల్, కొత్త బ్రిడ్జి నుంచి శివాలయం పుష్కరఘాట్ వరకు వాహనాలను అనుమతించి అక్కడి నుంచి పర్యాటకులను కాలినడకన డ్యామ్ పరిసరాల్లోకి పంపిస్తున్నారు. పైలాన్‌కాలనీలోని జెన్‌కో జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను నిలుపుదల చేసి పైలాన్ నుంచి నేరుగా మాచర్ల వెళ్లే వాహనాలను పంపిస్తున్నారు. నడువ లేని వారు, వృద్ధులు ఉన్న వాహనాలను డ్యామ్ పరిసరాలకు అనుమతిస్తున్నారు.

### పులిచింతలలో 11 గేట్ల ద్వారా నీటి విడుదల

చింతలపాలెం : సాగర్ నుంచి వస్తున్న వరదతో మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు 11 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలకు ప్రస్తుతం 35.459 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి 2,46,601 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టులోని 24 గేట్లలో 6 రేడియల్ గేట్లను 2.50 మీటర్ల ఎత్తు, మరో 5 రేడియల్ గేట్లను 3.00 మీటర్ల ఎత్తు లేపి 2,30,682 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. పవర్ హౌజ్ ద్వారా 16,000 మొత్తం 2,46,682 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెళ్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. తెలంగాణ జెన్కోలో 16,000 క్యూసెక్కుల నీటితో 4 యూనిట్ల ద్వారా 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు.

# డ్రగ్స్‌పై యుద్ధం.. ఆపరేషన్ పరివర్తన్

## పోలీస్ స్టేషన్ల వారీగా కేంద్రీకరణ



- అందుబాటులో టెస్టింగ్ కిట్స్
- మునుగోడు, మిర్యాలగూడలో మంచి ఫలితాలు
- హైవేలపై నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు
- కలెక్టర్ సహకారంతో వివిధ శాఖల భాగస్వామ్యం
- నేటి నుంచి 14 వరకు అవగాహన కార్యక్రమాలు
- నమస్తే తెలంగాణతో ఎస్పీ శరత్ చంద్ర పవార్

**సమాజాన్ని పట్టిపీడిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ నిర్మూలనపై నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ యుద్ధం ప్రకటించింది. ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో ఆపరేషన్(మిషన్) పరివర్తన్ పేరుతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నది. జిల్లా పరిధిలో డ్రగ్స్ నిర్మూలన కోసం ఇప్పటికే పలు చర్యలు చేపట్టగా మంచి ఫలితాలు వచ్చినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి సహకారంతోపాటు వివిధ విభాగాల భాగస్వామ్యంతో డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తుపదార్థాలను జిల్లా నుంచి తరమికొట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. గురువారం ఎస్పీ పవార్ తన కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. డ్రగ్స్ ప్రస్తుత సమాజానికి ఓ సవాల్‌గా మారుతోందని, దానికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసిన దీనిపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ తెలిపిన విషయాలు ఆయన మాటల్లోనే...**

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు8(నమస్తే తెలంగాణ)

'డ్రగ్ టెస్టింగ్ కిట్లను పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాం. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ మాదిరిగానే డ్రగ్ టెస్టింగ్ కూడా సులువే. అందువల్ల కిట్స్ ద్వారా ఇప్పటికే అనుమానం ఉన్న వ్యక్తులను పరీక్షిస్తున్నాం. ఈ విషయంలో మునుగోడు, మిర్యాలగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అలవాటు ఉన్న వారిని పీఎస్‌ల వారీగా ముందుగా గుర్తించాం. వారికి టెస్టులు చేస్తే పాజిటివ్ వచ్చింది. మునుగోడులో ఇలా 30 మందిని, మిర్యాలగూడలో 30 మందిని పరీక్షించాం. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చాం. భవిష్యత్‌లో డ్రగ్స్ వాడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాం. వారందరినీ కొద్దిరోజుల తర్వాత మళ్లీ పరీక్షించాం. మునుగోడులో అందరికీ నెగెటివ్ రాగా, మిర్యాలగూడలో మాత్రం ఇద్దరు మళ్లీ డ్రగ్స్ వాడినట్లు తేలింది. వారిద్దరిపై కేసు పెట్టి జైలుకు పంపించాం. ఈ శనివారం కనగల్, కట్టంగూర్ పీఎస్‌ల పరిధిలో గంజాయి వినియోగిస్తున్నట్లు అనుమానం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించనున్నాం. వారికి కూడా తొలి దశలో కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. కొంత సమయం ఇచ్చి మళ్లీ పరీక్షలు చేస్తాం. ఇలా అన్ని పోలీస్ స్టేషన్లలో దశల వారీగా ఆరు నెలల్లో డ్రగ్స్ వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. మరోవైపు గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఇతర ప్రాంతాల్లో నుంచి జిల్లాలోకి రాకుండా అడ్డుకోవడంతోపాటు జిల్లా పరిధిలోని హైవేల మీద నుంచి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్న గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాలపై నిరంతరం నిఘా ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా 8 నిఘా బృందాలు నిరంతరం పెట్రోలింగ్‌లో విధుల్లో ఉంటాయి. వారికి సాయంగా 'నార్కోటిక్ డాగ్స్'ను కూడా రంగంలోకి దించాం. ఇటీవల కేతేపల్లి వద్ద భారీఎత్తున గంజాయిని పట్టుకోవడంలో డాగ్స్ పాత్రే కీలకం. నార్కోటిక్ డాగ్స్ గంజాయి వాసనను దూరం నుంచే గుర్తిస్తాయి. వాటి సాయంతో హైవేలపై నిఘా పెట్టాం. ఇలా అన్ని దశల్లోనూ డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలన్నదే లక్ష్యం. వివిధ శాఖల సహకారంతో వివిధ కార్యక్రమాలను కూడా రూపొందిస్తున్నాం. కలెక్టర్ నారాయణరెడ్డి సహకారంతో పలు శాఖలను భాగస్వామ్యం చేస్తూ ఈ నెల 9 నుంచి 14 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నాం. డ్రగ్స్, వాటి దుష్పరిమాణాలపై అన్ని స్థాయిల్లోనూ అవగాహన కల్పించాలని భావిస్తున్నాం. అవగాహన ర్యాలీలు, మానవహారాలు, వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులు, యువతను ఇందులో భాగస్వాములను చేస్తాం. అంతిమంగా నల్లగొండ జిల్లాలో డ్రగ్స్‌కు సాధ్యమైనంత వరకు అడ్డుకట్ట వేయడమే తక్షణ కర్తవ్యం' అని ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరించారు.

## గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 8 : మండల పరిధిలోని బాలెంల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కామర్స్, మ్యాథ్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నీలా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి 55శాతం ఉత్తీర్ణత సాధించాలని, అధిక విద్యార్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 12న కళాశాలలో అభ్యర్థులు రెజ్యూమ్ సమర్పించాలని, 12న సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు.

## ఎయిమ్స్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు



నర్సింగ్ సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, ఆగస్టు 8 : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ వారోత్సవాలను నియోనాటాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫ్యామిలీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా ఏడు రోజులు రోజుకో విధంగా ఎంబీబీఎస్ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, జూనియర్, సీనియర్ రెసిడెంట్‌లకు క్విజ్, రోల్‌ప్లే, ఫోకస్డ్ గ్రూప్ డిస్కషన్ నిర్వహించారు. బ్రెస్ట్ ఫీడింగ్ కౌన్సెలింగ్‌పై వర్క్ షాప్ చేపట్టారు. నిర్వహించారు. చివరి రోజు బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులకు బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా బహుమతులు, సర్టిఫికెట్‌లను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ జె.అరోరా, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ పి.వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.